క్లుప్తంగా

ఉపాధి పనుల తనిఖీ



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

సింహాద్రిపురం : మండలంలోని కాంబల్లె గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళశారం ఎంపీడీఓ కృష్ణమూర్తి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కొలతల ప్రకారం కూలీ డబ్బులు అందుతున్నాయా, లేదా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉపాధి సిబ్బంది కూలీల డబ్బుల గురించి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆయన మస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరునికి భస్మార్చన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య సందర్భంగా స్వామికి ఘనంగా భస్మార్చన నిర్వహించారు. స్వామివారికి వేద పండితులు ప్రదోష కాల సమయంలో పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్య, రుద్రాభిషేకం నిర్వహించి సహస్రనామార్చన, భస్మార్చన నిర్వహించి భస్మహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

చేనేత స్టాళ్ల ఏర్పాటు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలో టీడీపీ మహానాడు మంగళవారం ప్రారంభమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నేతన్నలు 11 స్టాళ్లను మహానాడు ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ స్టాళ్లను రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత సందర్శించారు. ప్రతి స్టాల్ దగ్గరికి వెళ్లి... ఏయే ప్రాంతం నుంచి వచ్చారో అడిగి తెలుసుకున్నారు. వస్త్రాల నాణ్యత, తయారీ గురించి ఆరా తీశారు. చేనేత రంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలను, అమలు చేస్తున్న పథకాల గురించి నేతన్నలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె రూ.10 వేల విలువ చేసే చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. తనతో పాటు వచ్చిన అనుచరులతోనూ చేనేత వస్త్రాలు కొనుగోలు చేయించారు. అనంతరం అక్కడే డ్వాక్రా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన ఫుడ్, ఇతర స్టాళ్లను కూడా మంత్రి సవిత పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

కడప వైఎస్ఆర్ సర్కిల్: వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం అని వక్ఫ్ పరిరక్షణ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మహమ్మద్ రఫీ అన్నారు. మంగళవారం నగరంలోని కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో ×చట్టం ఎవరికి చుట్టం? అనే ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ముస్లింల ఐక్యతను దెబ్బతీయడం కోసం అయోధ్య సమస్య తీసుకురావటం, 370 రద్దు చేయడం, త్రిబుల్ తలాక్ అంశాన్ని తీసుకురావటం, హిజాబ్ అంశాన్ని తీసుకురావటం వెనుక ఒక మత రాజకీయ పార్టీ చేస్తున్న కుట్ర తప్ప వేరేది ఏమీ లేదన్నారు. అందుకని వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం? అనే పుస్తకాన్ని అత్యధికంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర నాయకులు ఇషాక్ అలీ, మత గురువు అక్బర్ అలీ రసాది, వక్ఫ్ బోర్డు పరిరక్షణ కమిటీ కన్వీనర్ అహ్మద్ బాబు బాయ్, నగర కన్వీనర్ మౌలానా జాకీర్ హుస్సేన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని వేంపల్లె మండలంలో గిరిజన ఎరుకుల మహిళపై దాడి చేసిన వారిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని పలు పార్టీలు, సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దగల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ఎరుకుల సామాజిక వర్గాలపై దాడులు రోజురోజుకు అధికమయ్యాయన్నారు. ఇప్పటికైనా ఆయా దాడులను అరికట్టేందుకు తగిన చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ ఆంజనేయులు, బీజేపీ జిల్లా అధ్యక్షులు సగిలి గుర్రప్ప, ఏఐవైహెచ్‌పీఎస్ స్టేట్ సెక్రటరీ శ్రీనివాసులు, బీసీ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు డీఎం ఓబులేశు, న్యాయవాది రత్నకిశోర్, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు దేవర శ్రీకృష్ణ పాల్గొన్నారు.

జిల్లాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో నెలకొన్న సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐసీసీ కో-ఆర్డినేటర్ సత్తార్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ×ఒక వైపు మహానాడు -మరొకవైపు మహాగోడు అనే ×కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లా పరిస్థితి ఎలా ఉందంటే ×ఒక వైపేమో మహానాడు-మరొక వైపేమో మహా గోడులా ఉందన్నారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 27, 28 ,29 తేదీల్లో టీడీపీ మహానాడు కడప జిల్లాలో ఏర్పాటు చేసిందని, తెలుగుదేశం పార్టీ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 11 నెలలు అయినా పథకాలు అమలు చేయలేదన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ పూర్తయ్యేది ఎప్పుడో..



సింహాద్రిపురంలో అర్ధాంతరంగా నిలిచిన ఆర్టీసీ బస్టాండు నిర్మాణ పనులు

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలో బస్సు షెల్టర్స్ లేక ప్రయాణికులు ఏళ్ల తరబడి అవస్థలు పడుతున్నారు. ప్రజల కష్టాలను గమనించి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సింహాద్రిపురంలోని మార్కెట్ యార్డు సమీపంలో నూతన బస్టాండు నిర్మాణానికి శంకుస్థాపన చేసి శరవేగంగా పనులు జరిగాయి. పనులు జరుగుతున్న సమయంలో ఎన్నికల కోడ్ వచ్చి కొద్ది పనులు మిగిలిపోవడంతో ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండు నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్టాండ్ శరవేగంతో నిర్మాణం పూర్తి చేసి ప్రారంభమవుతుందని ప్రజలు ఎంతో సంతోషపడుతున్న తరుణంలో ప్రభుత్వం మారడంతో ప్రజలు నిరుత్సాహపడ్డారు.

దూర ప్రాంతాలకు కేంద్రంగా సింహాద్రిపురం

దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులకు సింహాద్రిపురం కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. నిత్యం దూర ప్రాంతాలకు వేలాది మంది ప్రయాణీకులు సింహాద్రిపురం నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. బస్సులు ఇక్కడి నుంచి పులివెందుల, తాడిపత్రి, ప్రొద్దుటూరు, ధర్మవరం, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ప్రయాణికులు నిత్యం వెళుతుంటారు.

ప్రయాణికుల ఇబ్బందులు

ప్రయాణికులతో బస్టాఫ్ రద్దీగా ఉన్న సమయంలో ప్రయాణికులు టీ స్టాల్స్ వద్ద, దుకాణాల వద్ద బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక ఎండాకాలం, వానా కాల సమయాలలో ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతం. సింహాద్రిపురంలో ఆర్టీసీ బస్టాండులేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఆర్టీసీ బస్టాండు మిగిలి ఉన్న నిర్మాణ పనులు పూర్తి చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తోంది. ఇంత వరకు అది కార్యరూపం దాల్చలేదు. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులకు బస్టాండు అందుబాటులోకి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాల్సిన చాలామంది ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. గంటల తరబడి బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి. ఆర్టీసీ బస్టాండు అలాగే మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సమస్యను చూస్తున్నారే తప్ప పట్టించుకోవడంలేదు. ప్రయాణికుల ఇక్కట్లను గుర్తించి ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న బస్టాండును పనులను పూర్తిచేసి ప్రజల ఇక్కట్లను తొలగించాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు చొరవ తీసుకుని అసంపూర్తిగా నిలిచిన కొద్దిపాటి పనులను పూర్తిచేసి ఆర్టీసీ బస్టాండును అందుబాటులోకి తీసుకరావాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నిర్మాణం ఆగిపోయిన ఆర్టీసీ బస్టాండు భవనాలు



బస్టాండ్ లేక దుకాణాల వద్ద ఆర్టీసీ బస్సును ఎక్కుతున్న ప్రయాణికులు

నిలబడటానికి నీడలేదు



బస్టాండు లేక అసౌకర్యానికి గురవుతున్నాం. బస్టాఫ్ వద్ద నిలబడటానికి నీడలేదని, బస్సుల కోసం వేచి చూడాలంటే ఎన్నో ప్రయాసాలు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా మహిళలు బాత్రూంకు వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్ నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకరావాలి.

– దివ్య, ప్రయాణికురాలు, సింహాద్రిపురం

రాత్రివేళల్లో బస్సుల కోసం వేచి చూడాలంటే భయపడుతున్నాం



మహానగరాలకు వెళ్లేందుకు రాత్రి సమయంలో బస్సు కోసం వేచి చూడాలంటే భయపడుతున్నాం. సింహాద్రిపురంలో కనీసం కూర్చోవడానికి ఎక్కడ కనీసం కుర్చీలు కూడా లేవు. వర్షం వస్తే తడిచిపోవాల్సిందే. ప్రయాణీకులు చాలా కష్టాలు పడటంతోపాటు అసౌకర్యాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆర్టీసీ బస్టాండ్‌ను త్వరగా పూర్తి చేయాలి.

– విశ్వనాథరెడ్డి, ప్రయాణికుడు, సింహాద్రిపురం

ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదు

గత ప్రభుత్వ హయాంలో పాడా నిధులతో ఆర్టీసీ బస్టాండును నిర్మించారు. ఏపీఎస్ఆర్టీసీ నిధులతో బస్టాండు నిర్మించి ఉంటే మాకు సమాచారం ఉండేది. పాడా నిధులతో బస్టాండును ఏర్పాటు చేస్తుండటంతో మాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదు.

– రామకృష్ణ, ఆర్టీసీ డీఎం, పులివెందుల

చెన్నూరు షుగర్ ఫ్యాక్టరీని పునః ప్రారంభించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో మూసివేసిన చెన్నూరు షుగర్ ఫ్యాక్టరీని, ప్రొద్దుటూరు పాల కేంద్రాన్ని పునః ప్రారంభించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహానాడు వేదికగా జిల్లాలో మూసివేసిన పరిశ్రమలను పునః ప్రారంభించి కడప జిల్లా ప్రజల మన్ననలను పొందాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను, పంట కాలువలను సత్వరమే పూర్తి చేసి నిత్యం కరువుతో అల్లాడుతున్న జిల్లా రైతాంగాన్ని వారి పంట పొలాలకు నీరిచ్చి ఆదుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున ప్రభుత్వ వాగ్దానం ప్రకారం పెట్టుబడి ఖర్చులకు గాను ప్రతి రైతుకు రూ.20వేలను వెంటనే అందించాలని, 90 శాతం సబ్సిడీతో సాగుకు విత్తనాలు , 50శాతం సబ్సిడీతో వ్యవసాయ యంత్రాలను రైతులకు అందించాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి. రామ్మోహన్ రెడ్డి, జిల్లా నాయకులు పక్కీరప్ప పాల్గొన్నారు.

యోగాపై వ్యాసరచన పోటీలు

కడప కల్చరల్ : జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా కడప నగరంలోని విశ్వాత్మ పిరమిడ్ యోగా రీసెర్చి సెంటర్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జీవీఎస్ రెడ్డి తెలిపారు. జూన్ 6వ తేదీలోపు వ్యాసరచన పోటీ కోసం రచనలు పంపాలని డాక్టర్ డి.ఊర్మిలాదేవి సూచించారు. వ్యాసరచనతోపాటు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు అభ్యర్థులు ఈ చిరునామాకు పంపాలన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలను కూడా బహూకరించనున్నట్లు తెలిపారు. వివరాలకు 8074826819 నెంబరులో సంప్రదించాలన్నారు.

రేషన్ వాహనాలను ఆపేయడం శోచనీయం

వేంపల్లె : కూటమి ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసే ఎండీయూ వాహనాలను ఆపి వేయడం శోచనీయమని వైఎస్సార్‌సీపీ ప్రచార సంయుక్త కార్యదర్శి నిస్సార్‌బాషా తెలిపారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద ప్రజలందరికీ ఇంటి వద్దనే ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసేందుకు గత ప్రభుత్వ పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి ఎండీయూ వాహనాలను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఎండీయూ వాహనాలు ఉండటంవలన కూలీ పనులకు వెళ్లిన పేద ప్రజలకు, వృద్ధులకు కూడారేషన్ బియ్యం అందేవని, కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో పేద ప్రజలు, కూలీలు రేషన్ షాపుల వద్ద కాపలా ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చక పోవడంతోపాటు ఉన్న పథకాలను రద్దు చేయడం అన్యాయమన్నారు. ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో ఆపరేటర్లకు కూడా ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఎండీయూ వాహనాలు ఉండటంవలన నిరుద్యోగులకు కూడా ఉపాధి అవకాశాలు ఉండవన్నారు.

యోగా చేయడం దినచర్యగా మార్చుకోవాలి



పులివెందులలో యోగాసనాలు చేయిస్తున్న గురువు వెంకట్రామిరెడ్డి, తదితరులు



కమలాపురంలో యోగా గురించి మాట్లాడుతున్న కమిషనర్ జగన్నాథ్

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరూ యోగా చేయడం దినచర్యగా మార్చుకోవాలని యోగా గురువు వెంకట్రామిరెడ్డి తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మైత్రి లే ఔట్‌లోని స్థానిక వైఎస్సార్ మోమోరియల్ పార్కులో వార్డు సచివాలయ సిబ్బంది, పురపాలక నీటి సరఫరా సిబ్బందికి యోగా గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు వెంకట్రామిరెడ్డి సిబ్బందిచే యోగాసనాలు చేయించారు. కార్యక రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాభ్యాసం.. ఆరోగ్య దాయకం

కమలాపురం : యోగాభ్యాసం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం అవుతుందని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నగర పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించి ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ యోగను అభ్యసించి మానసిక ఒత్తిడులను దూరం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు యోగా చేయడం ద్వారా ఆరోగ్య దాయకంగా ఉండవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో శారీరక, మానసిక ఉల్లాసం కోసం, ఆరోగ్యం కోసం, యోగా చేయాలన్నారు. ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరూ ఉదయం లేచినప్పటి నుంచి ఉరుకులు, పరుగుల మీద జీవనం సాగిస్తుండటంతో రోగాల బారిన పడుతున్నారని వివరించారు. అదే యోగా చేస్తే చదువులో ఏకాగ్రత పెరగడంతో పాటు ఎలాంటి రోగాలు దరి చేరవని సూచించారు. అలాగే ప్రతి రోజు యోగా సాధన చేయడం ద్వారా మనలోని బలహీనతలను తొలగించి మనల్ని చైతన్య వంతుల్ని చేస్తుందన్నారు. యోగ చేయడం ద్వారా శారీరక, మానసిక ఉపశమనం లభిస్తుందన్నారు. ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేసిన యోగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, యోగా మాస్టర్లు మధు, వీరాంజనేయ, మెప్మా సిబ్బంది, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న అరటి పంట పరిశీలన



దెబ్బతిన్న అరటి చెట్లను పరిశీలిస్తున్న ఉద్యాన పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు

సింహాద్రిపురం : మండలంలోని నంద్యాలంపల్లెలో రైతు వాసుదేవరెడ్డి గత ఏడాది కిసాన్ అగ్రి బయోటెక్ కంపెనీకి చెందిన 5 వేల అరటి మొక్కలను 4 ఎకరాల విస్తీర్ణంలో నాటుకున్నారు. అరటి గెలలు ఆలస్యంగా రావడం, కొన్ని చెట్లు గెలలు వేయకపోగా తోటలో చెట్లన్ని వేరు వ్యవస్థ సరిగా లేకపోవడం, 5వ నెల నుంచే అరటి చెట్లన్ని పడిపోయాయి. 6వ నెలలో రావాల్సిన పూతలు 9 నెలలు గడిచినప్పటికి రాలేదు. అరటి మొక్కలు నాటి ఏడాది పూర్తయినప్పటికి అరటి గెలలు కోతకు రాలేదు. మంగళవారం మహానంది ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త కిశోర్‌కుమార్, కొవ్వూరు ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త స్నేహలతలు దెబ్బతిన్న అరటి తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్ఓ మల్లేశ్వరరెడ్డి మాట్లాడుతూ దెబ్బతిన్న అరటి చెట్లను ల్యాబ్‌లో పరీక్షించి తదుపరి నివేదిక రాగానే కంపెనీ వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రంలో రైతు సేవ కేంద్ర సిబ్బంది ప్రత్యుష, రైతులు పాల్గొన్నారు.

యువకులపై పోలీసుల వ్యవహారం దారుణం

జమ్మలమడుగు : రాష్ట్రంలో పోలీసుల వ్యవహార శైలి దారుణంగా తయారవుతుంది. రాజ్యాంగ బద్ధంగా శిక్షించవలసిన నిందితులను చట్టాన్ని తమ చేతిలోకి తీసుకుని నడి రోడ్డుపై విద్యార్థులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం ఎమిటని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి యోబు తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెనాలిలో యువకులు ఏదో చేశారంటూ సీఐలు నడిరోడ్డుమీద కూర్చొబెట్టి కాళ్ల కదిలించకుండా సీఐ స్థాయి అధికారి మోకాళ్లపై కాళ్లు పెట్టి పోలీసులు తీవ్రంగా చావబాదడం ఎమిటని ప్రశ్నించారు. యువకులు ఏమైన తప్పులు చేసి ఉంటే వారిపై చట్టబద్ధమైన కేసులు పెట్టి న్యాయస్థానంలో హాజరు పరచి వారికి శిక్షపడే విదంగా చేయాలే తప్ప ఇలా వ్యవహరించడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో పోలీసులు రెడ బుక్ రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటూ అందరిని భయాందోళనకు గురి చేస్తున్నారని విమర్శించారు.

ప్రైవేట్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : 2025–26 విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ప్రైవేట్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్ల యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గెద్దం రాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని అనేక మార్లు విద్యాశాఖాధికారులకు వినతి పత్రాలు అందించినా నేటి వరకు ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని ఆయన పేర్కొన్నారు. జీఓ ఎంఎస్ నంబర్ 1 ప్రకారం ప్రైవేటు టీచర్లకు జీతం, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యుటీ, సెలవులు ఇవ్వాలని వివరించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అన్ని పాఠశాలల్లో జీఓ ఎంఎస్ నంబర్ 1ని అమలు చేసేలా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్సార్ విగ్రహాలు కనపడకుండా పచ్చ తోరణాలు

– టీడీపీ శ్రేణుల దుశ్చర్య



అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల : కడప పట్టణంలో జరుగుతున్న మహానాడు కార్యక్రమాన్ని సాకుగా చూపుతూ తెలుగుదేశం పార్టీ శ్రేణులు పులివెందుల ప్రాంతంలో విచ్చలవిడిగా టీడీపీ జెండాలు, తోరణాలు కడుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, హాలు గంగాధరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, పార్నపల్లె కిశోర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కోడి రమణ, హరి, జహీర్, ప్రశాంత్‌లు తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లోనూ, మున్సిపల్ కార్యాలయంలోని సిబ్బందికి వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాల చుట్టూ నీచ రాజకీయాలకు తెరలేపుతూ తెలుగుదేశం పార్టీకి సంబంధించిన పసుపు తోరణాలు, జెండాలతో వైఎస్సార్ విగ్రహాలు కనిపించకుండా పులివెందుల ప్రజలు మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఈ దుశ్చర్యలవలన ప్రజలు, పార్టీ శ్రేణులు తీవ్ర అసహనానికి లోనవుతున్నారని కావున పులివెందుల ప్రాంతంలో వైఎస్సార్ విగ్రహాల చుట్టూ ఏర్పాటు చేసిన టీడీపీ జెండాలను, తోరణాలను వెంటనే తొలగించి ఆహ్లాద వాతావరణానికి నాంది పలకాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నాయీ బ్రాహ్మణ సంక్షేమ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలుపుతున్న మున్సిపల్ చైర్మన్

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కనకరావు ఆదేశాల మేరకు మంగళవారం పులివెందుల నియోజకవర్గంలోని నాయీ బ్రాహ్మణ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణులు నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పులివెందుల అధ్యక్షుడిగా పట్నం రామ్మోహన్, ఉపాధ్యక్షుడిగా బోనాల మహేష్, జనరల్ సెక్రటరీగా బూచుపాటి సంజీవులు, జాయింట్ సెక్రటరీలుగా శంకర్, అంజి, ట్రెజరర్‌గా మురళి, ప్రధాన కార్యదర్శులుగా శ్రీధర్, విజయ్, లోకేష్, శ్రీను, పవన్, రాజశేఖర్, సలహాదారులుగా దంతలూరు మునెయ్య, గండికోట కొండయ్య, చింతకుంట్ల హరికృష్ణ, నల్లపురెడ్డిపల్లె అంజి, రామకృష్ణ, కామసముద్రం కుళ్లాయప్ప, రాము, పాలగిరి రవిశంకర్, పసుపులేటి గోపాల్, తదితరులు ఎన్నుకున్నారు. ఎన్నికైన వీరిని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు హాలు గంగాధరరెడ్డి, రసూల్, చంద్రమౌళి తదితరులు అభినందనలు తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

పోరుమామిళ్ల : త్రైత సిద్ధాంత భగవద్గీతే శ్రీకృష్ణుడి నిజమైన బోధని ఇందూ జ్ఞానవేదిక ప్రబోధ సేవా సమితి అధ్యక్షులు నర్రా శ్రీనివాసరెడ్డి, సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొండుగారిపల్లె, తిరువెంగళాపురం, రాజాసాహేబ్‌పేట గ్రామాల్లో వారు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. దైవజ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని, మతాలు నిషిద్ధమని అందరూ తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కర్మయోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలని అవగాహన కల్పించారు. ప్రచారంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు తిరుపతయ్య, రాజేశ్వరి, నారాయణ, రామకృష్ణ, బాలయ్య, మస్తాన్, రామకృష్టారెడ్డి, రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక సంబంధాలతోనే ఎయిడ్స్ వస్తుంది



హెచ్ఐవీ గురించి జానపద పాటల ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వేంపల్లె : సురక్షితం కానీ లైంగిక సంబంధాల ద్వారా ఎయిడ్స్ సోకుతుందని సీడీఎస్ నాగిన్‌బాషా తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద కమ్యూనిటీ డెవెలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జానపద కళాకారులచేత వీధి నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ కేవలం నాలుగు మార్గాల ద్వారా మాత్రమే వస్తుందని వివరించారు. మొదటిది సురక్షితం లేని లైంగిక సంబంధాల ద్వారా వస్తుందన్నారు. అలాగే కలుషిత సూది మందులు, సిరంజీలు ద్వారా, హెచ్ఐవీ సోకిన తల్లి నుంచి బిడ్డకు, కలుషిత రక్త మార్పిడి ద్వారా సంక్రమిస్తుందన్నారు. హెచ్ఐవీ ఉన్న గర్భిణుల నుండి పుట్టబోయే బిడ్డకు హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కళాకారులు జానపద పాటల ద్వారా వివరించారు. అలాగే హెచ్ఐవీ యాక్ట్ 2017 హెచ్ఐవీ చట్టం గురించి క్లుప్తంగా వివరించారు. అదేవిధంగా హెచ్ఐవీ గురించి ఎలాంటి సందేహం ఉన్న 1097 టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించి వివరాలను అడిగి తెలుసుకోవాల్సిందని తెలిపారు. కార్యక్రమంలో సీడీఎస్ సుభాషిని, ఐసీటీసీ కౌన్సిలర్ ఆంజనేయులు, కళాకారులు పాల్గొన్నారు.

మూగజీవాలకు పింఛనర్ల ఆసరా

సింహాద్రిపురం : ప్రభుత్వం ఇచ్చే పింఛన్ల డబ్బులతో ఇద్దరు వ్యక్తులు మూగ జీవాల ఆకలి తీరుస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వారికి వచ్చే డబ్బులు వానరుల గుంపుశుకు ఆహారం అందించి వాటి ఆకలిని తీరుస్తున్నారు. మండల కేంద్రమైన సింహాద్రిపురంకు చెందిన జయరామిరెడ్డి, రఘునాథరెడ్డిలు వారికి వచ్చే పింఛన్ డబ్బులతో వానరాలకు ఆహారం అందిస్తూ దాతృత్వం చాటుకుంటున్నారు. ప్రతిరోజు వారు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద, అలాగే మసీదు, టవర్ వద్ద ప్రతిరోజు సాయంత్రం అయ్యేసరికి వానరాలకు కావలసిన ఆహారం తీసుకెళ్లి అందిస్తూనే ఉన్నారు. సమయానికి కోతులు కూడా వారి చెంతకు చేరుతాయి. ఇలా 8 ఏళ్ల నుంచి వీరు కోతులకు ఆహారం అందిస్తున్నారు. ఇది కాక జయరామిరెడ్డి ప్రతిరోజు పొలాల గట్టుల వెంబడి పక్షులకు గింజలు చల్లి వస్తూ ఉంటాడు. ప్రతినిత్యం ఈ చర్య చేయనిదే ఆయనకు నిద్ర పట్టదు. అలాగే అరటిపండ్ల వ్యాపారస్తులు కూడా వీరికి లాభం లేకుండానే అరటిపండ్లను అందిస్తారు. అలాగే దాతలు వీరికి సహాయ సహకారాలు అందిస్తే మూగ జీవులకు ఆహారం అందించిన వారవుతారు. అలాగే వారికి కూడా ప్రోత్సాహకరంగా ఉంటుంది.





వానరాలకు అరటి పండ్లను అందిస్తున్న పింఛనర్లు జయరామిరెడ్డి, రఘునాథరెడ్డిలు

రిజర్వేషన్లు అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ పదోన్నతిలో రిజర్వేషన్లు పక్కగా అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ప్రధానోపాధ్యాయుల, ఉపాధ్యాయుల ప్రమోషన్లలో రిజర్వేష న్లు పారదర్శకంగా జరపాలని కోరారు. ఏ ఏ క్యాడ ర్లో ఎంత మంది ఎస్సీ, ఎస్టీ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారో, బహిర్గత పరుస్తూ డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపరచి ఉపాధ్యాయ సంఘాలకు కూడా అందుబాటులో ఉంచాలని కోరా రు. అడేక్వసీని కూడా బహిర్గత పరచాలన్నారు.

ప్రమోషన్లలో రిజర్వేషన్లు రోస్టర్ కం మెరిట్ పద్ధతిలో ఇవ్వాలని అన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుదర్శన్ బాబు మేండ్రగుత్తి గంగరాజు, జిల్లా కార్యదర్శి కట్టా గంగాధర్ పాల్గొన్నారు.